

# నది

మలయాళ మూలం: ఒ.వి.విజయన్

తెలుగుసేత: ఎల్.ఆర్.స్వామి

**నదిలోనే స్నానం చేసేవాడు సుబ్బారావు. కాని అతని స్నానం ఒకంతుకు పూర్తి అయ్యేది కాదు, నలుగుపిండి ఒళ్ళంతా పట్టించుకొని స్నానం చేసేవాడు. ఒళ్ళు రుద్దుకోవటమైపోయినా, నదిలోనే అలా కూర్చొని వుండేవాడు సుబ్బారావు. అక్కడకే, స్నానానికి వచ్చిన ఎనిమిదేళ్ళ మంగ, రోజూ అతన్ని అడుగుతూ వుండేది "మామయ్యా, ఇంకా స్నానమవలేదా, ఏంటి?"**

"స్నానం అయ్యిందంటే అయినట్టే; లేదంటే లేదు" సుబ్బారావు జవాబు అది.

"ఈ మామయ్య రోజూ ఇలాగే అంటారు" మంగ విసుక్కునేది.

మంగ ముద్దుమాటలకు, సుబ్బారావుకు నవ్వు వచ్చేది. స్నానమయ్యాక కూడా నదిలోనే, కూర్చొని వుండేవాడు, సుబ్బారావు. అలా కూర్చున్నప్పుడు, ఒక్కొక్క రోజు నది ప్రవహించే దిశలో కూర్చునేవాడు. అప్పుడప్పుడు, ప్రవాహానికి ఎదురు గానూ కూర్చునేవాడు. మంగ గడుసుపిల్ల. ఆ విషయం గమనించి, అలా కూర్చోటమెందుకని, అడిగింది ఒకరోజు.

"కారణం, నీవు పెద్దదానివైనాక తెలుస్తుందిలే"సుబ్బారావు అన్నాడు.

"ఎంత పెద్దదానైనాక?" మంగ అడిగింది.

"అమ్మమ్మ అంత అయ్యాక".

"అంతవరకు ఆగాలా?" ముద్దులొలకపోస్తూ అడిగింది మంగ "చెప్పు మామయ్యా, ఇప్పుడే చెప్పవచ్చుగా".

"అయితే విను" సుబ్బారావు అన్నాడు "మనమంతా ప్రవాహంలో కలసిపోవలసినవాళ్ళమే".

"నేను..."

"నీవు కూడా. నీకు అనుమానమెందుకు?"

"నాకు ప్రవహించాలని లేదు మామయ్యా" మంగ అంది.

"నాకు ప్రవాహంలో కలసిపోవాలని లేదు".

సుబ్బారావు ప్రవాహాన్ని చూస్తూ కూర్చున్నాడు. చేతులు, పాదాలు నీళ్ళలో కదలించి ప్రవాహాన్ని ఆస్వాదించాడు. ఆ తరువాత అడిగాడు.

"ఏం చెప్పావు పాప?"

"ప్రవాహం అంటే నాకు భయం" మంగ మళ్ళీ అంది.

"నీవు చిన్నదానివి కదా, అందుకే భయం అనిపిస్తోంది. పెద్దదానివైతే భయముండదులే".

మంగ స్నానమైంది. నది ఉద్భవ దిశవైపు తిరిగి కూర్చొని వున్నాడు, ఆరోజు అతడు.

"ఎందుకిలా కూర్చున్నావో చెప్పవా?" మంగ అడిగింది.

"చెప్తాను" సుబ్బారావు ఒక నిమిషం ఆలోచిస్తూ ఉండిపోయాడు. ఆ తరువాత అన్నాడు. "మంగా, ప్రవహించే మనకు ప్రవాహం గురించి తెలిసివుండాలి. ప్రవాహం ఎక్కడనుంచి ప్రారంభమవుతుందని ఎక్కడకి వెళ్తుందని తెలియాలి. అందుకే ఇలా..."

"మామయ్యా, నీకు తెలిసిందా?"

"రోజురోజుకి కొద్దికొద్దిగా తెలుస్తోంది".

"మొత్తం తెలిసేదెప్పుడు?"

సుబ్బారావు జవాబు పలకలేదు. తన శరీరంవైపు దృష్టి మళ్ళించాడు. చాలాసేపు అలాగే వుండిపోయాడు. ఆ తరువాత అన్నాడు "ఆ సమయం వస్తుందిలే".

"ఈ మామయ్యకి పిచ్చి" గట్టిగా నవ్వుతూ మెట్లు ఎక్కి ఒడ్డుకు వచ్చింది మంగ.

మంగ పెళ్ళి చేసుకొని ఊరునుంచి వెళ్ళిపోయింది. ఆ తరువాత స్నానం చేసేటప్పుడు కబుర్లు చెప్పుకోవటానికి, మాటలాడటానికి ఎవరూ లేకపోయారు సుబ్బారావుకి. ఆప్యాయతలు, బంధాలు తెగిపోతేనే మంచిదని అనుకున్నాడు అతడు. ప్రవాహానికి అడ్డు వుండదు కదా! రోజులు నెలలుగా, సంవత్సరాలుగా ఎదిగాయి. ఇప్పుడు సుబ్బారావు నది ఉద్భవ దిశవైపు తిరిగి కూర్చోవటం లేదు. నది ఉద్భవం గురించి తనకి తెలిసిందనే నమ్మకం కుదిరింది అతనికి. నదిలో విలీనం కావటం గురించే తెలుసుకోవలసి వుంది.

ఆరోజు ఊరివైద్యుడు నదిలో స్నానానికి దిగారు.

"ఇదేంటి, ఇదేంటి?" సుబ్బారావు ఆశ్చర్యంగా అడిగాడు.

"మీరు నదిలో స్నానంచేస్తారా?" మీకు అలవాటులేదు కాబోలు".

"నదికి అవతల ఊరికి వెళ్తున్నాను" వైద్యుడు అన్నాడు.

"నది వద్దకు రాగానే ఒకసారి నదిలో మునగాలని తోచింది"

"మంచిది"

వైద్యుడు స్నానం చేసి వెళ్ళిపోయాడు. రోగిని చూసి మందులిచ్చి వెనక్కు రావటానికి మూడు గంటల సమయం పట్టింది అతనికి. సుబ్బారావు అప్పటికి నదిలోనే కూర్చొని వున్నాడు.

"ఇదేంటి సుబ్బారావు, ఇంకా స్నానం కాలా?" వైద్యుడు అడిగాడు.

ఒక నవ్వు నవ్వి ఊరుకున్నాడు సుబ్బారావు.

"ఇంతసేపు నీళ్ళలో నానటం మంచిది కాదు" వైద్యుడు ఒక సలహా పారేసాడు.

సుబ్బారావు నీళ్ళలోనే కూర్చున్నాడు. ఆరోజు ప్రప్రథమంగా పాదాల వేళ్ళ కొసలు తేలికైనట్టు తోచింది అతనికి. వ్యర్థమైన కొవ్వు శరీరం నుంచి వూడి నీళ్ళ ప్రవాహంలో కొట్టుకుపోయినట్టు తోచింది. వూడిన కొవ్వుని మోసుకొని నీళ్ళ ప్రవాహం దూరదూరాలకు కదలిపోయింది. దూరంగా వెళ్ళే ఆ కొవ్వుతోపాటు, పాదాల వేళ్ళ కొసల ప్రజ్ఞ, ఆ నది అంతట, ఆ తరువాత సముద్రమంతట వ్యాపించినట్టు అనిపించింది- కడలిలోనే పాదాలు పెట్టుకునే అనుభూతి.

కథ

మధ్యాహ్నమైంది. నదిలో స్నానం చేసేవారు లేరు. హాయిగా ఊపిరి పీల్చుకున్నాడు, సుబ్బారావు. మళ్ళీ చైతన్యం పుంజుకుంది, ప్రవాహం మళ్ళీ కొవ్వుని తురిమి తీసింది. పాదాలు, కాళ్ళు, తొడలు ప్రవాహంలో విలీనమై ప్రవహించినప్పుడు, కడలి గురించిన జ్ఞానం మరికొంత పెరిగింది. ప్రవాహం వల్ల కలిగిన మధురమైన అలసట, వేళ్ళ కొసలనుంచి అరిచేతుల్లోకి, అక్కడనుంచి భుజానికి, భుజం నుంచి మెడకి పాకింది. ప్రవాహంలోకి తల జాపాడు, సుబ్బారావు. నది యొక్క ఆకర్షణా శక్తి మెదడుకు చేరింది. ఆ చల్లదనానికి మెదడు లోపల వెయ్యి దళాల పద్మం వికసించింది. పద్మంగా, సుబ్బారావు నీళ్ళలో తేలాడు. దాని కోసం ఎన్నేళ్ళు వేచి వున్నాడు, అతడు! పద్మమిచ్చిన పరిశుద్ధమైన జ్ఞానంతో, ఆ జ్ఞానదళ వెలుగులో కాస్త విశ్రాంతి తీసుకున్నాడు సుబ్బారావు. మెలమెల్లిగా ఆ దళాలు కూడా నదిలో కలిసాయి.

నది, అనుభవమైంది; జ్ఞానమైంది; వెలుగైంది. చివరిదళం నదిలో విలీనమైనప్పుడు, నది ద్వారా కొండ నుంచి కడలివరకు కనబడినది, సుబ్బారావు నవ్వే!